మధుర స్మృతులు



శ్రీమతి పాలకూర సీతాలత

"అమ్మా! ఈ పుస్తకం నా టేబుల్‌మీద పెట్టమ్మా ..." అంటూ హడావుడిగా లోపలకు వచ్చిన కొడుకు వంక సోఫాలో కూర్చుని ఏదో కుట్టుకుంటున్న మధుర చూపులతోనే అడిగింది — 'ఏమిటా తొందర ?' అంటూ.

"మా ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ కదమ్మా! ఇప్పటికే ఆలస్యం అయింది. ఈ పుస్తకం సెకండ్ హాండ్ షాపుల్లో కూడా ఒక పట్టాన దొరకలేదు. చివరికి అతికష్టం మీద దొరికింది. వస్తాను ..." అంటూ అంత వేగంగామా బైటకు వెళ్లిపోయాడు జ్ఞానప్రకాశం.

వెళ్లిపోతున్న కొడుకు వంక ఆప్యాయంగా చూస్తూ వుండిపోయింది మధుర. తనకు జీవితంలో మిగిలినదేమిటె ? ఈ ఒక్క బిడ్డేకదా. తన భర్త ద్వారకానాథ్ ... ఆకస్మికంగా మరణించిన తరువాత తనుకూడా చచ్చిపోవాలనుకున్న నిర్ణయం సడలిపోవడానికి కారణం ఈ జ్ఞానప్రకాశం కదూ ? ఆశలన్నీ వాడిమీదే పెట్టుకుని భర్తకోరిక ప్రకారం వాడిని ఇంజనీరింగులో చేర్చి, వాడు భవిష్యత్తులో గొప్పవాడు కావాలని, తన భర్తలాగే 'గొప్ప ఇంజనీరు' అని పేరు తెచ్చుకోవాలనీ ఆశిస్తూ, అందుకు సరియైన వాతావరణం కల్పిస్తూ ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుని బ్రతుకుతోంది.

చేతిలో ఉన్న పుస్తకం వంక చూసింది. బరువుగా వుంది. అక్షరాలు చదివింది. 'ఎలక్ట్రికల్ టెక్నాలజీ — బై థరాజా ...' పేరు ఎక్కడో పరిచయం అయినట్లుగా వుంది. ఆలోచించింది. అవును తను కాపురానికి వచ్చిన కొత్తలో భర్త దగ్గర అన్ని పుస్తకాలూవుండేవి. అన్నీ ఒక లైబ్రరీలో వుంచినంత జాగ్రత్తగా వుంచేవాడు.

"చదువు పూర్తయ్యి మీరు ఇంజనీరు అయిపోయారు కదా! ఇంకెందుకండీ ఆ పుస్తకాలు ? అమ్మిపారెయ్యకూడదూ ..." అంది తను.

"లేదు ... అప్పుడప్పుడు నాకు రిఫరెన్సుకి కావాలి ... ఈ పుస్తకాలు చదివే నేను స్టేట్ ఫస్ట్ వచ్చానన్న గర్వం వీటిని చూస్తుంటే కల్గుతుంది. ఏదో చెప్పలేని ఆత్మీయత, వీళ్లు నా స్నేహితులన్న భావమూ కల్గుతుంటాయి. ఇంత విలువైన పుస్తకాలని అమ్మేసి డబ్బు తెచ్చుకున్నా, ఆ డబ్బువల్ల నాకు సుఖం వుండదు."

"మీదొక సెంటిమెంట్ .." అంది సన్నగా నవ్వుతూ.

"సెంటిమెంటో, డబ్బులు గుద్దే మింటో — నాకు తెలియదుగానీ ... నేను లేనప్పుడు ఈ పుస్తకాలు అమ్మిపారెయ్యకు ఇవి నా జీవితాంతం వుండాలి. మన కుర్రవాడు ఈ పుస్తకాలతోనే చదువుకోవాలి .. " అన్నాడు తనని దగ్గరకు తీసుకుని, తన బుగ్గమీద మృదువుగా రాస్తూ.

తను సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది.

అతని చేతిని అక్కణ్నుంచి తీసి సౌమ్యంగా విసిరికొట్టింది.

"ఏం ? ఎందుకా సిగ్గు?" అంటూ కొంటెగా నవ్వేడు ద్వారకానాథ్. తన బుగ్గల్ని సుతారంగా నిమిరేడు.

అవును. అప్పుడు తను నాలుగో నెల కడుపుతో వుంది.

మరో నాల్గు రోజుల తర్వాత భర్త ఏదో పుస్తకం రిఫర్‌చేస్తూ కూర్చుంటే

"ఏమిటండీ అది ? అంత లావుగా వుంది!..." అంది ఆశ్చర్యంగా.

పుస్తకం ముడిచి అట్టమీద అక్షరాలు చూపించేడు ఆమెకు. చదివింది—

"ఎలక్ట్రికల్ టెక్నాలజీ—బైధ రాజా..."

"ఈ పుస్తకాన్ని కోపంగా ఎవరిమీదకైనా విసిరితే గిద్దెడురక్తం కారుతుంది..."అందితను.

"ఊఁ..." అన్నాడు అతను చిన్నగా నవ్వుతూ, పుస్తకంలో మునిగిపోయి.

పతి అనురాగంలోని మాధుర్యం చవి చూస్తూ, ఆనందంగా కాలం గడిపింది. అలాంటి భర్త దొరకడం తన అదృష్టం అని మురిసిపోయింది. అతను కూడా భార్యనే లోకంగా భావించి, ఆమెకు ఏ రకమైన లోటు కలగకుండా చూసుకునేవాడు. అతనిలాంటి భర్తలు ఈ లోకంలో చాలా అరుదు అన్నమాట పూర్తిగా సత్యం.

జ్ఞానప్రకాశం పుట్టిన నాలుగు సంవత్సరాలకు తనకు తెలియకుండానే ఈ 'ఎలక్ట్రికల్ టెక్నాలజీ' పుస్తకం మాయం అయ్యింది.

ఆ రోజు చిత్తుకాగితాలవాడు వస్తే పాత పేపర్లు, పుస్తకాలు ముందుపడేసి, వంటింట్లో కూర మాడిపోతోందని లోపలకు వెళ్ళింది వాడు చూస్తుంటే— అయిదు నిముషాల తర్వాత తను వచ్చేసరికి వాడు ఆ కాగితాలు అన్నీ సర్దేసుకుని గోనెసంచీలో కుక్కుకున్నాడు. డబ్బులు లెక్క కట్టి ఆమె చేతిలో పెట్టాడు. వాడు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం ద్వారకానాథ్ మళ్ళీ పని పడి ఆ లావు పుస్తకంకోసం చూస్తే అదిలేదు. ఏమైపోయిందా అనుకుంటూ వెతకసాగాడు.

నాలుగేళ్ల జ్ఞానప్రకాశం "ఇంత లావుగా వుండే పుస్తకమా ?" అన్నాడు. "అది ఇందాకా వచ్చిన కాగితాల అబ్బాయికి ఇచ్చేశానుగా..." అన్నాడు.

"నువ్వు.. ఇచ్చేవా?" ఆశ్చర్యంగా అన్నాడు ద్వారకానాథ్.

"నేలమీద పడివుంది. అక్కర్లేదనుకుని.."

నిజమే ! పొద్దున హడావుడిగా చదువుతూ ఆఫీసుకు వెళ్లే తొందరలో సోఫాపక్కనే నేలమీద వుంచేశాడు. అందుకే...

"అరెరే..." అన్నాడు ద్వారకానాథ్.

"పాపం! పసివాడు... వాడికేం తెల్సు?" అనుకున్నాడు.

అదుగో... ఆ రకంగా ఆ పుస్తకం ఇంట్లోంచి బైటకు వెళ్లిపోయింది.

ఆలోచనలు ఆపి పుస్తకం తిప్పింది. చాలా పాతగా వుంది.

రెండు పేజీలు తిప్పేకా ఆశ్చర్యంతో, ఆనందంతో అలా చూస్తూ వుండిపోయింది.

అందుకు కారణం— ఆ పేజీమీద రంగు మాసిపోయి వెలవెలబోతున్న అక్షరాలు. ఆ అక్షరాలు కలిపితే— "సి. ద్వారకానాథ్..." అవుతుంది...

అంటే... ఇది ఆ పుస్తకమే... భర్త పుస్తకమే.

ఆ రోజు... తన చిట్టి చేతులతో పుస్తకం బైటకు పంపేసిన జ్ఞానప్రకాశం, ఈ రోజు దుకాణాలన్నీ తిరిగి తిరిగి ఈ పుస్తకం అదే చేతులతో తెచ్చుకున్నాడు.

రాసివున్న భర్త పేరుమీద కుడివేలి చూపుడు వేలుతో స్పృశించింది.

ఆ తర్వాత మధురస్మృతులలో మునిగిపోయింది. అవి మధురయొక్క స్మృతులేకాదు— మధురమైన స్మృతులు కూడా.

* * *

జ్ఞానప్రకాశం పుట్టిన రెండు సంవత్సరాల తర్వాత ...

ఆ రోజు ఆఫీసు టూర్ మీద వెళ్లిన ద్వారకానాథ్ తిరిగి వచ్చాడు.

ఇంట్లోకి వచ్చిన ద్వారకానాథ్ హాల్లో 'మధుర' కన్పించక పోవడంతో ఆశ్చర్యపోతుండగా మేడ మెట్లు దిగి వస్తున్న డాక్టర్‌ని చూసి కొంచెం గాభరా చెందాడు.

"ఓ ... ఇదేనా రావడం ?" అంటూ పలుకరించాడు డాక్టర్.

"అవును... ఇంతకీ మీరు ?" ఆత్రంగా అడిగేడు.

"నిన్న మీ మిసెస్ మెట్ల మీంచి జారి పడిపోయారు. గాభరా పడవల్సిన అవసరం లేదు ... సింపుల్ ఫ్రాక్చర్... కానీ ..." ఆగేడు డాక్టర్.

"చెప్పండి డాక్టర్ ..." ఆ గొంతులో ఆందోళన.

"సారీ ! ఆమె గర్భం పోయింది ..."

"ఓ ..." బాధగా కళ్లు మూసుకున్నాడు

"ఆమెకు అపాయం లేదు కదా !..."

"లేదు... కానీ... ఆమెకు ఇక ముందు పిల్లలు కలిగే అవకాశం కూడా ..."

"నో ప్రాబ్లమ్ డాక్టర్!... నాకు కావల్సింది 'మధుర ...' ఆమె వుంటే చాలు... ఆమెను రక్షించండి ..."

"ఆమెకు ఏం ఫర్వాలేదు..."అన్నాడుడాక్టర్.

"థ్యాంక్యూ ..." అంటూ అక్కడ ఒక్క నిముషం కూడా వుండకుండా గబగబా మెట్లు ఎక్కాడు.

మంచం మీద కాళ్లకు కట్లతో పడి వుంది మధుర.

"మధురా ..." అంటూ వెళ్లి ఆమె పక్కన కూర్చున్నాడు.

ఆమె నోరు విప్పి మాట్లాడలేదు కానీ కళ్లలో నిండుగా నీళ్లు.

"ఎందుకు ? ఏమైందని ? నేను వచ్చేశాను కదా !..." అన్నాడు.

ఆమె వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టింది.

"ఛ ... ఊరుకో... తప్పుకదూ !......" అన్నాడు.

"నేను... మీకు... మీ ఆశ ప్రకారం .. పాపను... ఇయ్యలేను... " బాధగా అంది.

"ఫర్వాలేదు. అందుకు బాధ లేదు. నాకు నువ్వే కావాలి... అంతే... " అన్నాడు ఆమె ముఖం తన చేతుల్లో ఇముడ్చుకుంటూ.

మరో నెల రోజులకు మామూలు మనిషి అయ్యింది... కానీ ఆమెలో మాత్రం గూడు కట్టుకున్న నిరాశ ...

"జరిగింది మర్చిపోయి ఆనందంగా వుండాలి నువ్వు... ఇలా బేలగా కూర్చుంటే నేను చూడలేను. మధురా... నాకు పిల్లలు నీకంటె ఎక్కువ కాదు... నువ్వే నా సర్వస్వం అని ఎన్ని సార్లు చెప్పాను ?" అన్నాడు కొంత బుజ్జగించుతున్నట్లుగా, కొంత మందలిస్తున్నట్లుగా.

ఆమెలో ఆశించిన మార్పు కన్పించకపోతే, సరదాగా ఎటైనా తిరిగి వస్తే బాగుంటుందని 'కాశ్మీర్' ట్రిప్పు వేశాడు.

జబల్పూరు, ఖజురాహో, భోపాల్, గ్వాలియర్, ఆగ్రా, ఢిల్లీ, చండీఘర్, జమ్ము మొదలైన ప్రదేశాలన్నీ తిప్పాడు. చూడదగిన ప్రదేశాలన్నీ చూపించాడు.

ఆమె అనుక్షణం నవ్వుతూ వుండేలా, బాధను మర్చిపోయేలా చేశాడు.

ఆ యాత్రలోనే ఆమె మామూలు మనిషి అయ్యింది.

ద్వారకానాథ్ కూడా సంతోషించేడు అతనికి కావాల్సింది అదే.

ఈ నెల రోజుల్లో ఆమెలో ఉత్సాహం కల్గింది. పాత గాయం మానింది.

జ్ఞానప్రకాశంని అల్లారు ముద్దుగా పెంచుతూ, ఆశలన్నీ వాడిమీదే వుంచుకుని, రోజులు గడపసాగేరు.

మధుర కూడా బాబునే లోకంగా చేసుకుంది.

ద్వారకానాథ్ తృప్తిగా నిట్టూర్చేడు.

ఒక వారం రోజుల తర్వాత ద్వారకానాథ్‌కే ఒక ఏక్సిడెంట్ జరిగింది.

ఆఫీసు నుంచి వర్క్‌సైట్‌కి అతను జీపు నడుపుకుని తీసుకువెళ్తుండగా ఎదురుగా రాంగ్ సైడ్‌లో ఒక లారీ వచ్చింది. ప్రమాదం తప్పించాలనే సదుద్దేశ్యంతో స్టీరింగు పక్కకు తిప్పాడు. అది ఒక చెట్టుకు గుద్దుకుని ఆగిపోయింది. ఆ జర్క్‌కి దూరంగా వెళ్లిపడ్డాడు అతను. ఫలితం — కాలు విరగడం — రెండు నెలలు మంచంమీదే వున్నాడు.

మధుర రాత్రనక, పగలనక అతనికి సపర్యలు చేస్తూ గడిపింది.

అన్నీ మంచం దగ్గరే. అతనికి అన్నం అక్కడే. స్నానం లేదు కనుక తడిగుడ్డతో ఒళ్లు తుడిచేది. తల దువ్వేది. బోరు కొట్టకుండా కబుర్లు చెప్పేది. అసలైన, సిసలైన సహధర్మచారిణిలా ప్రవర్తించింది. ఆమె సేవలకు పొంగిపోయేడు.

"మధురా !. . నావల్ల నీకు పని ఎక్కువైపోయింది కదూ !... నీకు కష్టం కల్గుతోంది కదూ !..." అన్నాడు గిల్టీగా.

అతని పెదాలపై తన అరచేతినుంచింది.

"నా సర్వస్వం మీరే .. మీకుకాక ఇంక నేను ఎవరికి చేస్తాను ? మనమధ్య అలాంటి మాటలకు తావులేదు. మీకు ఇలా అయిందన్న విషయం నాకు బాధ తెస్తుందిగానీ మీకు సేవలు చెయ్యవల్సివచ్చినందుకు కాదు. అది నా ధర్మం.. నా బాధ్యత..."

ఆమె గొంతులోని సిన్సియారిటీకి ఆశ్చర్యపోయాడు.

"మధురా !... నీ మనసు మధురం... నీ పలుకు మధురం... నీ చేతలు మధురం... నీ రూపు మధురం... నీ నడవడి మధురం... నిన్ను భార్యగా పొందిన నా బ్రతుకే మధురం" అన్నాడు.

ఆమె సిగ్గుపడిపోయింది.

"చాల్లెండి. కబుర్లు నేర్చారు. మాటల్లో మహావీరులైపోతున్నారు మీరు..." అంది సన్నగా నవ్వుతూ.

"ఆలాగా !... మాటల్లోనే కాదు...చేతల్లో కూడా వీరుడనని ఋజువు చేస్తానుండు..." అంటూ ఆమెను చేతుల్తో గట్టిగా బంధించి, ఆమె ముఖాన్ని దగ్గరకు లాక్కుని తన పెదవులతో...

ఆమె విడిపించుకుంటూ —

"ఆగండి... మీకు కాలు బాగోలేదు. కదలవద్దు... ఆవేశపడవద్దు. ."

"ఫర్వాలేదు.. కాలు బలహీనమైనా నా మనసు బలంగానే వుందిలే..."

భార్యాభర్తల మధ్య ప్రేమ ఉంటుంది. కానీ అది ఉండే మోతాదుల్లో తేడా వుండొచ్చు. కొందరు విప్పి చెప్పలేరు. . 'నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. నిన్ను విడిచి వుండలేనని. .' అవి మూగమనసులు. అంతమాత్రాన్న ప్రేమ లేదని అనుకోరాదు. ఒక్కొక్కసారి ఒక్కొక్క విచిత్రమైన సంఘటన జరుగుతుంటే ఆ మూగమనసుకు భాష వస్తుంది.

కాలు విరిగి మంచంమీద వున్నా ఒక్క రోజు కూడా బాధపడలేదు ద్వారకానాథ్. మధుర సమక్షంలో అనుక్షణం మధురక్షణాలు గడుపుతూ ఆమె కష్టపడుతోందని కించిత్తు బాధపడుతున్నా ఆమె గుర్తిస్తే ఆమె బాధపడుతుందని సరిపెట్టుకున్నాడు.

మరో రెండు నెలలకు మామూలు మనిషి అయ్యాడు.

వాడిపోని అనురాగ కుసుమంలా, ఇగిరిపోని ప్రేమ గంధంలా — ప్రేమానురాగాలు తమలో తామేకాక బాబుకు కూడా పంచి ఇస్తూ రోజులు గడపసాగారు.

మధుర అంత మంచి భర్త దొరికాడని పొంగిపోని క్షణం లేదు.

ద్వారక అంత మంచి భార్య దొరికిందని ఆనందించని నిముషం లేదు.

ఆదర్శ దంపతుల లిస్టు ఎవరైనా తయారుచేస్తే అందులో వుండవల్సిన మొట్టమొదటి పేరు వాళ్లిద్దరిదీ.

సాఫీగా సాగుతున్న ఆ జీవితంలో ఒకసారి ఒక చిన్న అపశృతి పలికింది.

అది ద్వారకానాథ్ ప్రొఫెషన్‌లో మార్పు తెచ్చింది తప్ప, దాంపత్య జీవితంలో కాదు ద్వారకానాథ్ డ్యూటీలో చాలా ఖచ్చితమైన మనిషి. నీతిగా వుంటాడు. కష్టపడి పని చేస్తాడు. లంచం అన్నమాట వింటే చాలు శివాలు ఎత్తిపోతాడు. ఆ మాట ఎవరైనా అంటే గొంతు చించుకుని 'గెటౌట్' అంటాడు

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగువారికి సేవ చేస్తోంది.

విజయవాడ, హైదరాబాద్‌ల నుండి వెలువడుచున్నది.

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ మన సినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ కలైడోస్కోపు కార్టూన్
★ దినవార ఫలాలు ★ పల్లెసీమ ★ శ్రీకృష్ణ భాగవతం
★ ఇదివారీ దృక్పథం ★ యుద్ధకాండ ★ వింత యథార్థం

★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు ... .

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము.

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి !

మంచికి మహారాజా పదవి దక్కుతుందనీ, చెడుకు చెరసాలే గతి అనీ అనుకోవడం ఈ కలియుగంలో తెలివితక్కువ మాట అని మరోసారి ద్వారకనాథ్ విషయంలో బుజువయ్యింది.

ఒక ప్రాజెక్టు నిర్మాణంలో ఒక కంట్రాక్టర్ రంగస్వామితో గొడవ అయ్యింది. పనిలో జాప్యాన్ని సహించని ద్వారక ఆ కంట్రాక్టర్ నత్తవేగంతో పని చేస్తుంటే అలా కుదరదని గొడవ పడ్డాడు. ఆ కంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మాట్లాడేడు. అందుకు కారణం అతను ద్వారక కంటె పెద్ద ఇంజనీర్ల జేబులు నింపడం వల్ల.

అతనిపై ఆఫీసర్లు ఆ రంగస్వామిని సపోర్టు చేస్తూ, అతని పనిలో జాప్యానికి కారణం కొన్ని సామానులు లేకపోవడమని నమ్మించారు. ఆ తర్వాత ద్వారక ఊరుకున్నాడు. కానీ కంట్రాక్టర్ మాత్రం మీసం దువ్వుకుంటూ —

"ఈ ద్వారకకు నేను ఇచ్చిన లంచం సరిపోలేదని అలా గొడవపడ్డాడు. ఆ తర్వాత మరి కొంత సొమ్ము ఇచ్చాను. అందుకే ఇప్పుడు నోరు మూసుకున్నాడు ..." అని చెప్పసాగాడు, అందరితో.

ఆది నిజమని నమ్మారు పెద్ద ఆఫీసర్లు. వాళ్లు గుడినీ, గుళ్లో లింగాన్నీ మింగినవాళ్లే అయినా ద్వారక గుడిని మింగేడని భ్రమపడి పెద్దమనిషిలాగ నటిస్తూ —

"ఏమయ్యా! ఆ కంట్రాక్టర్ అలా అంటాడేం? వాడి దగ్గర లంచం తిన్నావా?" అన్నారు.

"అదంతా అబద్ధం ..." అన్నాడు నమ్మకంగా.

అన్యాయంగా లక్షలు సంపాదించిన రంగస్వామికి ద్వారక తనని అంత తేలిగ్గా తీసి పారెయ్యడం నచ్చక పగబట్టి, ఎంత డబ్బయినా ఖర్చుపెట్టి ద్వారకకు ఉద్వాసన చెప్పాలని నిర్ణయించుకుని, కార్యశూరుడై ఆ పై ఆఫీసర్లకు మరింత ఎక్కువ లంచం తినిపించి, దొంగ సాక్ష్యాలు సృష్టించి ద్వారక తన ద్వారా లంచం తీసుకున్నాడని నిరూపించి ద్వారకను సస్పెండు చేయించి గర్వంగా మీసం దువ్వుకున్నాడు.

దొంగని దొంగ అంటే వాడికి కోపం రాదు.

దొంగ కాని వాడిని దొంగ అని వేళాకోళంగా అన్నా కూడా కోపం తెచ్చుకుంటాడు. అదే జరిగింది ద్వారక విషయంలో.

తనపై ఇంత ఘోరమైన నింద వస్తుందని ఊహించకపోవడంతో బాగా దెబ్బతిన్నాడు. అభిమానపడి తనంతతాను ఉద్యోగానికి రిజైన్ చేశాడు.

తను పొదుపుగా వాడుకున్న డబ్బుతో ఒక చిన్న 'ఇంజనీరింగ్ గూడ్స్ షాప్' తెరిచాడు తెలివిగా మేనేజ్ చేసుకుంటూ దాన్ని అభివృద్ధి చేశాడు. దానిమీద బాగానే గడించడం మొదలు పెట్టాడు.

కాలం గడుస్తున్నా, తన నీతిపై తగిలిన దెబ్బకు బాధ మాత్రం తగ్గలేదు. తనలో తాను మధన పడుతూ వుండేవాడు.

"జరిగింది ఏదో జరిగిపోయింది. మర్చిపొండి. ఆ భగవత్కృపవల్ల మనకు లోటు లేకుండా గడిచిపోతోంది. అనవసరమైన ఆలోచనలతో మనసు పాడుచేసుకోకండి." అని నచ్చ చెప్పేది మధుర.

ఆమె కోసం బాధను మర్చిపోయినట్టు నటించేవాడు.

పన్నెండు సంవత్సరాలు గడిచిపోయాయి

కొడుకు జ్ఞానప్రకాశంని ఏమైనాసరే ఇంజనీరింగులో చేర్చాలని పట్టుబట్టి, సాధించేడు

"చాలు మధురా ... నా కోరిక తీరింది వీడు కూడా ఇంజనీరు అవుతాడు. అంతేచాలు" తృప్తిగా నిట్టూర్చేడు.

ఆ రోజు ... మధుర జీవితంలో చెడ్డ రోజు —

ద్వారక ఆమెకు దూరం అయినరోజు —







జ్ఞానప్రకాశం పితృహీనుడయిన రోజు —

రాత్రి సుమారు తొమ్మిది గంటల వేళ, దుకాణం మూసి ఇంటికి వస్తున్న ద్వారక ఎదురుగా ఒక లారీ చాలా స్పీడ్‌గా వస్తూండటం గమనించాడు. ఫుట్‌పాత్ మీద తనకు కొంచెం ముందుగా రంగస్వామి నడుస్తున్నాడు. డ్రైవరు తాగివున్నాడో, లేక యాంత్రిక లోపంవల్ల కంట్రోలు తప్పిందో తెలియదు గానీ ఆ లారీ ఫుట్‌పాత్ మీదకు వచ్చేసింది. రంగస్వామి ఆ లారీ క్రింద పచ్చడి అయిపోవల్సినమాట. ప్రమాదం గుర్తించి ద్వారక వడిగా ముందుకొచ్చి రంగస్వామిని వెనకాల్నుంచి ముందుకునెట్టి, తను కూడా ముందుకు పోయేంతలో — లారీ క్రింద పడి పోయేడు. లారీ చక్రాలకు అంటిన నెత్తురు ద్వారకది.

రంగస్వామి ముందుకు పడబోయి చేతులతో ఆనుకుని వెనక్కి తిరిగి చూస్తే—జరిగిన సంగతి గమనించేకా — అతడి కళ్లలోంచి రక్తం కారింది— కన్నీళ్లు కాదు.

ద్వారకకు ఇప్పుడు పట్టినగతి, తనకు పట్టవల్సింది. తనని రక్షించిన వాడు ద్వారక. ఏ ద్వారక ? తను ఎవరి పొట్టమీద కొట్టాడో, ఎవరి సుఖమయ జీవితంలో తను నిప్పులు పోశాడో — ఆ ద్వారక ...

తేరుకుని జరగవల్సిన కార్యక్రమం జరిపాడు పోలీసుల్ని పిలిచాడు. డ్రైవరు తాగి వున్నాడు. ఆ తర్వాత కబురు మధురకు చేరవేశాడు.

ఆమె గుండెలు అవిసేలా ఏడ్చింది. పెడ బొబ్బలు పెట్టింది. ఆ సమయంలో రంగస్వామి అన్నీ అయి కార్యం జరిపించేడు. అతనిలో గొప్ప పరివర్తన వచ్చింది. చుక్కాని లేని నావలాంటి ఆ కుటుంబానికి పెద్దదిక్కు అయ్యి ఆ కుటుంబ భారం మొయ్యాలని అనుకున్నాడు. అదే అన్నాడు —

"అమ్మా ! నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి. ఒకనాడు ఆయనకు నేను అన్యాయం చేశాను. అయినా దాన్ని మనసులో పెట్టుకోకుండా నన్ను రక్షించి తన దొడ్డ మనసు చాటుకున్నాడు. నన్ను రక్షించే ప్రయత్నంలో తను ప్రాణ త్యాగం చేశాడు. మీరు ఏం చింతించవద్దు. మీకు తోడు నీడగా నేను వుంటాను. మిమ్మల్ని నా ఆత్మీయులుగా చూసుకుంటాను. ఆర్థికంగా, సాంఘికంగా మీకు అండగా నిలుస్తాను. ఆ దుకాణం నా చేతుల మీదగా నడుపుతాను ..."

మధుర అంగీకారంగా తల ఊపింది.

ఆ రోజు నుంచీ రంగస్వామి వాళ్ళకు ఆప్తుడయ్యాడు. దుకాణం చూసుకుంటూ అండగా నిలిచాడు. జ్ఞానప్రకాశం చదువుకుంటున్నాడు. తను మాత్రం భర్తనే తల్చుకుంటూ, తండ్రి లేని లోటు కన్నబాబుకు తెలియకుండా ప్రేమతో అతన్ని పెంచుతూ కాలం గడుపుతోంది.

జ్ఞానప్రకాశం తెలివైనవాడు. బహుశా తండ్రి పోలికలు వచ్చాయి కాబోలు. అతను ఫస్టు రావడం చూసి మురిసిపోతూ వుంటుంది.

'మీ కోరిక మేరకు బాబు గొప్ప ఇంజనీరు అవుతాడు ...' అని రోజుకోసారి అయినా భర్త ఫోటోకు చెప్పకుని మురిసిపోతుంటుంది. ఇక తన జీవితంలో వాడు కాక వేరేగా మిగిలిన పెన్నిధి మాత్రం ఏమున్నది ? వాడు తన కలల పంట. తన బంగరు నిధి.

వయసులో ముసలిది కాకపోయినా, జీవితంలో అనుభవాలు అన్నీ పొందేశాకా ఇక మిగిలింది ఏముందన్న నిరాశతో రోజులో చాలా భాగం భగవ ధ్యానంలో గడుపుతోంది. రంగస్వామి చలవ వల్ల దుకాణం చూసేది ఎవరన్న సమస్య లేదు. అతను వచ్చి డబ్బు ఇస్తాడు. కొడుకు చదువుకుంటాడు. తను మాత్రం ఇల్లు కదలక, ఇంటి పనులు చేసుకుంటూ, భర్తను తల్చుకుంటూ, కొడుకును ప్రేమగా పెంచుకుంటూ —

* * *

"ఏమిటమ్మా ? నువ్వు అప్పట్నుంచీ అలాగే కూర్చుని వుండిపోయావా ? చేతులో ఆ పుస్తకం అలాగే వుండిపోయింది. ఆ కళ్లనిండా తడి ఎందుకమ్మా ?" అన్నాడు జ్ఞానప్రకాశం వస్తూ.

స్మృతులలోంచి తేరుకుందుకొక నిముషం పట్టింది మధురకు.

ఆమె భుజాలు పట్టుకుని కుదుపుతూ "అమ్మా" అన్నాడు జ్ఞానప్రకాశం..

"ఏంలేదుబాబూ ! మీ నాన్నగారు జ్ఞాపకం వచ్చారు" అంది.

"జ్ఞాపకం రావటమా ? ఆయన్ని నువ్వు అసలు మర్చిపోతే కదమ్మా జ్ఞాపకం రావడం రోజులో సగభాగం పైన నువ్వు ఆయన్నే తల్చుకుంటావు."

"అదికాదురా ! ఈ పుస్తకం ... మీ నాన్న గారిదే..." అంది పేరు చూపిస్తూ.

"నిజమా అమ్మా..."అంటూ ఆ పుస్తకం లాక్కుని ఆ పుస్తకం ముద్దు పెట్టుకున్నాడు కళ్ళకు అద్దుకున్నాడు. ప్రేమగా నిమిరాడు

"నిజమా అమ్మా...నిజమా !..." అతని భావోద్వేగం చెప్పలేనిది.

తల్లి పక్కనే కూర్చుని ఆ పుస్తకం వైపు ఆనందంగా, తండ్రి పేరు వైపు ఆప్యాయంగా చూస్తూ వుండిపోయేడు.

ఇంతలో రంగస్వామి వచ్చేడు.

ఒక బ్యాగ్ మధురకు అందచేస్తూ—

"ఇందులో అయిదువేలు ఉన్నాయమ్మా!.. వుంచండి ... ఎల్లుండి మన దుకాణంకి కావల్సిన కొన్ని సరుకులకోసం పట్నం వెళ్ళాలి ... వస్తానమ్మా ! ..." అన్నాడు.

ఈ రంగస్వామి లేకపోతే కొడుకు చదువుకుంటుపడేది. ఆ షాపు చూసుకోవాల్సి వచ్చేది. ఈ పెద్దమనిషి అసలైన మనిషికి వుండాల్సిన మంచి మనసు వుంది. అందువల్లనే పరివర్తన చెందాడు.

రంగస్వామి మెట్లు దిగి వెళ్లిపోయాడు.

ఆ క్యాష్‌బ్యాగ్ కొడుక్కి ఇచ్చి లోపల బీరువాలో పెట్టమంది.

జ్ఞానప్రకాశం లోపలకు వెళ్ళాడు.

ఆ పుస్తకాన్ని ముద్దు పెట్టుకుంది మధుర. ఆ పుస్తకం పేరు చదివింది మరోసారి.

"ఎలక్ట్రికల్ టెక్నాలజీ—బైద రాజా..."

భర్త పేరు చదివింది.

"సి. ద్వారకానాథ్ ..."

ఆ పుస్తకం గుండెలకు హత్తుకుంది మధుర. ★